క్లుప్తంగా

'హామీలను విస్మరించిన ప్రభుత్వం'

నేలకొండపల్లి: ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ గురువారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడంతో పాటు రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. నాయకులు పగిడికత్తుల సుదర్శన్, కైలాసపు గోపి, జెర్రిపోతుల మురళీకృష్ణ, సాయినవీన్, శ్రీనివాస్, రమేష్, రవి, గోపి, విజయ్, సిద్ధు, పగిడికత్తుల కిరణ్ ఉన్నారు.

కళాశాల పేరుతో మట్టి తరలింపు

ఖమ్మం సహకారనగర్: జేఎన్‌టీయూ కళాశాల వస్తోందని చెబుతూ రూ.కోట్ల విలువైన మట్టి తరలించారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ ఆరోపించారు. కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జింకలతండా వద్ద గుట్ట తవ్వి, మట్టిని తరలించారని, ఆతర్వాత జేఎన్‌టీయూ కాలేజీ పాలేరు నియోజకవర్గానికి మంజూరైందని ప్రకటించడం గర్హనీయమన్నారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి ఇన్వర్టర్ వితరణ



నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి గ్రామ వాసి చల్లగుండ వెంకట్రామయ్య ఇన్వర్టర్ అందించారు. ఈ సందర్భంగా ఆయనను కేంద్రం సిబ్బంది సన్మానించారు. వైద్యాధికారి గీత, సర్పంచ్ అనగాని అనిత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్‌లోని కైకొండాయిగూడెం క్రాస్‌లో శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. ఖమ్మం జహీరపురకు చెందిన కాంపాటి రామచంద్రయ్య – సరస్వతి దంపతుల రూ.15,116, రాజేష్ ఇంజనీరింగ్ వర్క్స్ యజమాని రాజేష్ రూ.5,116, తాటిపల్లి ఇంజనీరింగ్ యజమాని నవీన్‌బాషా గురువారం ఆలయ కమిటీకి రూ.3,116 నగదు అందజేశారు.

పరామర్శ..

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు లగ్గిశెట్టి వీరబాబు తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా గురువారం సంఘం రాష్ట్ర కార్యదర్శి కమర్తపు మురళి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకమర్తి శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు, తుమ్మా ఉపేందర్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాస్, అప్పారావు ఉన్నారు.

మిల్లు కార్మికుడికి పాము కాటు

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో రైస్‌మిల్లు కార్మికుడిని పాము కాటేసింది. రైస్ మిల్లులో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన దీపక్‌ను గురువారం రాత్రి పాము కాటు వేయగా సహచర కూలీలు నేలకొండపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి అనంతరం ఖమ్మం తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని పుట్టకోట క్రాస్ సమీపాన దాబా వద్ద ఈనెల 12న జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై గురువారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వైరా వైపు నుంచి ఖమ్మంలోకి కారు వస్తుండగా, వెనక నుండి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా, అందులో ఉన్న వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఘటనపై డ్రైవర్ గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రఘువరన్ జీటెక్, గదర్
వినోద	జైలర్
సాయిరాం	జైలర్, డీడీ రిటర్న్స్
ఆదిత్య	పిజ్జా
శ్రీనివాస	భోళాశంకర్
సుందర్	మిస్టర్ ప్రెగ్నెంట్, ప్రేమ్‌కుమార్

- ఖమ్మం గాంధీచౌక్

ఆర్‌యూబీ పనులు అంతేనా?!

సగంలో వదిలేయడంతో పొంచి ఉన్న ప్రమాదం

- తవ్వి వదిలేసిన గుంతలతో ఇక్కట్లు
- పశువులు, మనుషులు పడుతున్నారని ఆవేదన



ప్రమాదకరంగా ఉన్న ఆర్‌యూబీ గుంత

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 16వ డివిజన్ ధంసలాపురం ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అగ్రహారం రైల్వేగేట్ వద్ద ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణ పనులను గతేడాది మార్చిలో ప్రారంభించారు. అయితే, ఈ పనులు సగం కూడా పూర్తికాక ముందే నిలిచిపోయాయి. అర కిలోమీటర్ మేర గుంతలా తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. అగ్రహారం ప్రాంతంలోని రైల్వేగేట్‌కు అటువైపు.. ఇటువైపు నివసించే వారు వివిధ పనుల నిమిత్తం ఈ గేటు వద్ద ట్రాక్‌ను దాటాల్సిందే. కానీ గేట్‌కు ఇవతల వైపు తవ్వి వదిలిన గుంత ఆందోళన కలిగిస్తోంది.

పొంచి ఉన్న ప్రమాదం

ధంసలాపురం, అగ్రహారం ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.16.94 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను 2021లో శంకుస్థాపన చేయగా, గత ఏడాది మార్చిలో ప్రారంభించారు. కొద్దిమేర మాత్రమే పనులు చేసి వదిలిపెట్టడంతో ఇక్కడ తీసిన గుంతలో వర్షపునీరు చేరుతోంది. వర్షం కురిసినప్పుడల్లా చుట్టూ ఉన్న మట్టిపెళ్లలు ఊడి గుంతలో పడుతున్నాయి. గేట్ వద్ద రోడ్డు కూడా కుచించుకుపోతోంది. అటుగా వెళ్లే గేదెలు, మనుషులు ఎక్కడ పడిపోతారోననే ఆందోళన వ్యక్తమవుతోంది. రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గుంతలో జారిపడ్డాడు. స్థానికులు తాళ్ల సాయంతో బయటకు లాగడంతో ప్రమాదం తప్పింది. గుంత తవ్వి పనులు ఆపేయడంతో రవాణా సౌకర్యం మాటేమో కానీ ప్రమాదాల బెడదతో ఆందోళన చెందుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

నిల్వ నీటితో దుర్వాసన



ఆర్‌యూబీ పక్కన కోతకు గురైన ఇంటి పునాది

నెలల తరబడి ఆర్‌యూబీ గుంత అలాగే ఉండడంతో వర్షపు నీరు నిలుస్తోంది. అందులోనే వ్యర్థాలు, ప్లాస్టిక్ కాగితాలు చేరడంతో దుర్వాసన వస్తోంది. అలాగే, దోమలు కూడా విపరీతంగా తయారవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పిల్లలు పడతారనే భయం



గుంత తవ్వి వదిలిపెట్టడం వల్ల నీరు అంతా చేరి బావిలా మారింది. పాఠశాలలకు వచ్చి వెళ్లే పిల్లలు ఎక్కడ జారి పడతారోనని భయంగా ఉంది. చుట్టూ కట్టిన కర్రలు కూడా విరిగిపోయాయి. ఇకనైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి. అప్పటివరకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలి.

– పి.సరోజనమ్మ, అగ్రహారం

ఇంట్లో ఉండలేకపోతున్నాం..



ఆర్‌యూబీ కోసం తవ్వి వదిలేసిన గుంతలో నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. రాత్రి పూట ఓవైపు దోమలు, మరోవైపు దుర్వాసనతో ఇంట్లో ఉండలేని పరిస్థితి. గుంత ప్రమాదకరంగా మారిందని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వెంటనే నిర్మాణం పూర్తిచేసి ప్రమాదాలను అరికట్టాలి.

– బి.భద్రమ్మ, అగ్రహారం

దినదిన గండమే..



నిత్యం గేదెలతో ఈ గుంత పక్క నుంచి పొలాలకు వెళ్తాం. గుంత దాటితే గండం గడిచినట్లు అనిపిస్తోంది. ఏ రోజుకు ఇదే ఆందోళన మమ్ముల్ని వేధిస్తోంది. ఆర్‌ఓబీ పైనుంచి వెళ్దామంటే గేదెలతో అనుమతించడం లేదు. దీంతో గుంత పక్క నుంచే గేదెలను రైల్వే ట్రాక్‌ను దాటించాల్సి వస్తోంది.

– మామిడి శ్రీను, అగ్రహారం

కులవృత్తుల వారికి అండగా...



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: కుల వృత్తుల వారికి అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలుస్తుందని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గానికి చెందిన 300 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున బీసీ బంధు ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణా ప్రభుత్వం కుల వృత్తుల వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా పలు పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకాలు నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తు చేసుకోని వారికి కూడా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. పాలేరులో బీఆర్‌ఎస్‌దే గెలుపని, రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న తనను మరో మారు ఆశీర్వదించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 104 మంది లబ్ధిదారులకు రూ.34.58 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మీ, ఎంపీపీలు బాణోత్ శ్రీనివాస్ నాయక్, బెల్లం ఉమా, వజ్జా రమ్య, బోడ మంగీలాల్, జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, వరప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఖమ్మంమయూరిసెంటర్: శంకుస్థాపన చేసిన మేయర్ నీరజ, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని 41 డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు, 29 డివజన్ సుందరయ్య నగర్‌లో వీడీఎఫ్ రోడ్డు పనులకు మేయర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీఈ స్వరూపరాణి, ఏఈ నవ్యజ్యోతి, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మున్సిపల్ అధికారులు స్వరూపరాణి, దాదే సతీష్, నాయకులు నెల్లూరి చంద్రయ్య, బత్తుల బసవపున్నయ్య, చావా సత్యనారాయణ, కవి కుమార్, నంగి శ్రీనివాసరావు, లింగాల రవికుమార్, పడిగెళ్ల వెంకటేశ్వర్లు, ఎడ్లపల్లి నవీన్, సాయికృష్ణ, జీవన్, యాలాద్రి, అప్పారావు, మున్సిపల్ లైన్‌మన్లు సాంబశివరావు, సుధాకర్ పాల్గొన్నారు.

రహదారులు పరిశీలన

కార్పొరేషన్ పరిధిలోని 35, 37, 38వ డివిజన్లలో సుడా నిధుల ద్వారా జరుగుతున్న రహదారుల నిర్మాణ పనులను చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకటరావు, సుడా డైరెక్టర్ ముక్తార్, నాయకులు బాజెడ్ల రామ్మోహన్, షౌకత్ అలీ, రుద్ర గాని ఉపేందర్, బాలిని శ్రీనివాస్, గౌరీనాథ్, అఫ్సర్, సాజిద్, మున్సిపల్ ఏఈ శోభన్ బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: కాగా, మేయర్ నీరజ 43 డివిజన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తాగునీటి సరఫరా, చెత్త తరలింపులో సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే, చెత్త రహదారుల వెంట వేయకుండా వాహనాలు వచ్చినప్పుడు ఇవ్వాలని అవగాహన కల్పించారు.

రూ. 4.29 కోట్ల రుణమాఫీ

- 1,096 మంది రైతులకు లబ్ధి..



వివరాలు వెల్లడిస్తున్న బ్రాంచ్ మేనేజర్ ఇందు

నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో భాగంగా డీసీసీబీ నేలకొండపల్లి బ్రాంచ్ పరిధిలో 1,096 మంది రైతులకు లబ్ధి చేకూరింది. వీరికి సంబంధించిన రూ.4,29,51,746 రుణాలు మాఫీ అయ్యాయని బ్రాంచ్ మేనేజర్ పి.ఇందు తెలిపారు. మండల కేంద్రంలోని బ్రాంచ్‌లో గురువారం ఆమె మాట్లాడుతూ... బ్రాంచ్‌కు సంబంధించి తొమ్మిది పీఏసీఎస్‌ల పరిధిలో రుణాలు మాఫీ అయినట్లు జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. వారి ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. ఇందులో పైనంపల్లి సొసైటీలో 112 మంది రైతులకు రూ.55,13,076, మంగ్రాజుపల్లి సొసైటీలో 78 మంది రైతులకు రూ.44,83,994, బోదులబండ సొసైటీలో 121 మంది రైతులకు రూ.43,20,226, రాజేశ్వరపురం సొసైటీలో 132 మంది రైతులకు రూ.61,03,828, నాచేపల్లి సొసైటీలో 129 మంది రైతులకు రూ,41,34,671, చెన్నారంలో 61 మంది రైతులకు రూ.17,30,532, రామచంద్రాపురం సొసైటీలో 78 మంది రైతులకు రూ.38,17,856, నేలకొండపల్లి సొసైటీలో 322 మంది రైతులకు రూ.99,16,078, రాజారాంపేట సొసైటీ పరిధిలో 62మంది రైతులకు రూ.28,03,616 రుణ మాఫీ కాగా ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. వీరే కాక డీసీసీబీ బ్రాంచ్ పరిధిలో ఇరువురు రైతులకు రూ.1,27,869 మేర రుణమాఫీ జరిగిందని బీఎం తెలిపారు. కాగా, రుణాలు మాఫీ అయిన రైతులు కొత్త రుణాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని సూచించారు.

గృహలక్ష్మి దరఖాస్తుల గడువు పెంచాలి

ఖమ్మంరూరల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 30 వరకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నెకంటి సంఘయ్య మాట్లాడుతూ.. ఈ పథకానికి కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఇవ్వటంతో పేదలు దరఖాస్తు చేసుకోలేక పోయారన్నారు. వడ్లమూడి నాగేశ్వరరావు, నల్లగొండ ముత్తయ్య, యాకయ్య పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలి

తిరుమలాయపాలెం: గృహలక్ష్మి పథకంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని మండలంలోని హైదర్ సాయిపేట గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. దాసరి మహేందర్, వీరభద్రం, చింతోజు వెంకటాచారి, ఆనందరావు, మాజీ సర్పంచ్ భూక్యా వెంకన్న, వల్లపుదాసు భద్రయ్య, జావేద్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఖమ్మంలీగల్: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించే ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభ పోస్టర్లను గురువారం న్యాయవాదులు ఆవిష్కరించారు. సుగుణారావు, విప్లవ్‌కుమార్, శ్రీనివాస్, జానిమియా పాల్గొన్నారు.

డీడబ్ల్యూఓను కలిసిన ఉద్యోగ ప్రతినిధులు



సుమకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నూతనంగా బాధ్యతల్లో చేపట్టిన జిల్లా సంక్షేమాధికారి తాళ్లూరి సుమను టీఎన్జీవోస్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు కత్తుల రవి, కార్యదర్శి బండి శివరామకృష్ణ, ప్రతినిధులు పి నాగార్జున, షేక్ షకీరా బేగం, ఎన్ ముత్తయ్య, అచ్చుతరామ్, సాయికుమార్, సరిత, సరేష్, దేవకుమార్, రమాకుమారి, అప్సర్ అలీ, వైజయంతి మాల తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం రూరల్: విద్యారంగాన్ని ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందని, విద్యారంగం సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సరళ అన్నారు. ఈ మేరకు వివిధ సమస్యలపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు... మూడేళ్ల నుంచి ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయటం లేదని, గురుకులాలకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందించటం లేదన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఉదయశ్రీ, స్రవంతి, శిరీష, నాగలక్ష్మి, రాగిణి, నిఖిత పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో జాతీయస్థాయి అవార్డు



చావా సంపత్

ఖమ్మంఅర్బన్: ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఖమ్మంకు చెందిన ఫొటోగ్రాఫర్ చావా సంపత్ కుమార్ ప్రతిభ కనబరిచారు. ఆయన తీసిన చిత్రం జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైంది. విజయవాడలో ఈనెల 18న ఆయన అవార్డు స్వీకరించనున్నారు.



అవార్డుకు ఎంపికైన ఫొటో

మార్కెట్ అధ్యక్షుడికి సన్మానం



ఫజల్‌ను సన్మానిస్తున్న మంత్రి అజయ్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు అనుబంధ రిటైల్ కూరగాయల మార్కెట్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.డీ.ఫజల్‌ను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సన్మానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో మంత్రిని గురువారం ఆయన కలవగా సన్మానించి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్, సుడా చైర్మన్లు దోరేపల్లి శ్వేత, బచ్చు విజయ్‌కుమార్‌తో పాటు జి.నాగేశ్వరరావు, ఎం.డీ.షఫీ, కొండల్, జానీ, అంజి, సతీష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు జాబితా ఇవ్వాల్సిందే..

నేలకొండపల్లి: బీసీ బంధు కింద ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను బయటకు వెల్లడించాలని, ఈ విషయంలో గోప్యం పాటించడం సరికాదని ఎంపీటీసీ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు బొడ్డు బొందయ్య, చెరువుమాధారం సొసైటీ మాజీ చైర్మన్ ఈవూరి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వారు ఎంపీడీఓ జమలారెడ్డిని కలిసి మాట్లాడారు. అర్హత లేని వారిని బీసీ బంధుకు ఎంపిక చేశారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇది నిజం కాకపోతే వెంటనే జాబితా వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు మైనార్టీ రుణాల లబ్ధిదారుల ఎంపిక

కూసుమంచి: మండలంలో మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారుల ఎంపికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు లబ్ధి దారుల ఎంపిక ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

రుణమాఫీ డబ్బులు రైతులకే ఇవ్వాలి

నేలకొండపల్లి: రైతు రుణమాఫీ డబ్బులు రైతులకే ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ డబ్బులు రైతులకు ఇవ్వకుండా అప్పులకు జమ చేసుకుంటున్నారని ఆరోపించారు. బ్యాంకర్ల తీరు మారకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మహిళతోనే శక్తివంతమైన కుటుంబం



మాట్లాడుతున్న కవిత

ఖమ్మంగాంధీచౌక్: కుటుంబం శక్తివంతగా తీర్చిదిద్దటం ఆ కుటుంబంలోనే మహిళతోనే సాధ్యమవుతుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ కవిత అన్నారు. మహిళా, శిశుసంక్షేమ శాఖ, బ్రహ్మకుమారీ ఈశ్వరీయ ఆలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం నగరంలోని కస్బాబజార్‌లోని బ్రహ్మకుమారి మెడిటేషన్ సెంటర్‌లో మహిళా సాధికారత అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగాకవిత మాట్లాడుతూ.. కుటుంబంలో మహిళ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ఆ కుటుంబం అభివృద్ధి పథంలో నిలుస్తుందన్నారు. ప్రధానంగా కుటుంబంలో పిల్లల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వాలు కల్పిస్తున్న అనేక పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ప్రతినిధులు అరుణ బెహంజీ, సుప్రియ, లక్ష్మీ బెహంజీ, గీతా తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్య అరెస్టుపై ఆందోళన

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అక్రమంగా అరెస్టు చేయడం గర్హనీయమని సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. కృష్ణయ్య అరెస్టును నిరసిస్తూ గురువారం ఖమ్మంలోని జెడ్పీ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, నాయకుడు అన్నారపు రామాచారి మాట్లాడుతూ... కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కృష్ణయ్యను అరెస్టు చేసి వివిధ పోలీసుస్టేషన్లకు తిప్పడం సరికాదన్నారు. లింగబోయిన పుల్లారావు, మరీదు ప్రసాద్, సుగుణ, వెంకటేశ్వరావు, మురళి, శ్రీను, నాంచారయ్య, కరుణతేజ, కృష్ణ పాల్గొన్నారు.

బాలలంతా అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంఅర్బన్: బాలబాలికలు తమ చుట్టూ జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంపొందించుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ భారతరాణి సూచించారు. స్కోప్ ఆర్‌డీ చైల్డ్‌లైన్, మై చాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలోని బల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలల అక్రమ రవాణా, బాల్యవివాహాలు, లైంగిక దాడులు పెరిగిన నేపథ్యాన అపరిచితులను నమ్మొద్దన్నారు. చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలు ఎదురైతే 1098 లేదా 100కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. నరసింహారావు, రాజేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత



విద్యార్థిని సన్మానిస్తున్న గ్రూప్ సభ్యులు

ఖమ్మం సహకారనగర్: గుజరాత్ సూరత్‌లోని నిట్‌లో సీటు సాధించి ఆర్థిక సమస్యలతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థికి జాతిరత్నాలు ఫ్రెండ్స్ గ్రూప్ బాధ్యులు చేయూత అందించారు. ఖమ్మం రూరల్ ఎం.వెంకటాయపాలెంకు చెందిన నంద్ర సాయికార్తీక్‌కు నిట్‌లో సీటు రాగా, జాతిరత్నాలు మిత్రబృందం సభ్యులు గురువారం రూ.65వేలు అందజేశారు. బీఆర్‌ఎస్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ.. కార్తీక్ ఇంజనీరింగ్ పూర్తయ్యేవరకు అండగా నిలుస్తామన్నారు. తుమ్మల సురేష్, మందడపు సాయివెంకటకృష్ణ, మద్ది కిషోర్‌రెడ్డి, బోజెడ్ల దిలీప్, ప్రతాపనేని సాయివెంకట్, సామినేని చైతన్య, గుర్రం రాము, పునాటి శ్రీను, నల్లమోతు రాకేష్, కృష్ణమోహన్, రంజిత్ పాల్గొన్నారు.

ఉమెన్స్ కాలేజీలో అదనపు గదులు నిర్మించాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఉమెన్స్ జూనియర్ కాలేజీలో అదనపు గదులు నిర్మించాలని, మౌలిక వసతులు సమకూర్చాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ శైలజ కు వినతిప్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యురాలు సంగీత మాట్లాడగా స్రవంతి, ఉదయశ్రీ వెంకటలక్ష్మి, స్రవంతి, శిరీష, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మిర్చి సాగు..



మిరప మొక్కలు నాటుతున్న రైతు కూలీలు

తిరుమలాయపాలెం: వాతావరణం అనుకూలంగా ఉండడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో జోరుగా మిర్చి పంటను నాటే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వాతారణం చల్లబడి ఉండడం చిరు జల్లులు కురుస్తుండడంతో గురువారం వందలాది ఎకరాల్లో రైతులు మిర్చి తోటలు వేశారు.